నీటిని నింపరు.. దప్పిక తీర్చరు



చెన్నూర్‌రూరల్/నెన్నెల: గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలు వ్యయం చేసి మూగజీవాల దాహం తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో పశువులు, మేకలు, గొర్రెలకు దాహం తీర్చుకునేందుకు నీళ్లు కరువయ్యాయి. నీటి తొట్లను సంబంధిత అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మూలమలుపు.. మృత్యుపిలుపు

భీమిని: కన్నెపల్లి మండలంలోని పోలంపల్లి వీగాం గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. సూచికబోర్డులు కూడా లేవు. గత నెల 25న మూలమలుపు వద్దే బైక్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుడిరేవులో ఇసుక నిల్వలు



దండేపల్లి: మండలంలోని గుడిరేవులో భారీగా ఇసుక నిల్వలు చేశారు. సమీప గోదావరి నదిలో ఇసుకను తీసి, రహస్య ప్రదేశాల్లో దంప్‌చేసి ఉంచారు. ఇక్కడ నుంచి తరలించాల్సిన చోటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు దృష్టిసారించి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం... అస్తవ్యస్తం

- పల్లెల్లో ప్రత్యేక పాలనలో దుస్థితి
- రోడ్లపై మురుగు, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం
- పొంచి ఉన్న వ్యాధులు
- పట్టించుకోని అధికారులు

భీమారం: ప్రత్యేక పాలనలో పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. వారు పట్టించుకోకపోవడంతో పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పరిస్థితి ఇలానే కొనసాగితే అంటువ్యాధులు తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. మండలంలో మొత్తం 11 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కార్మికులతోపాటు ట్రాక్టర్లను గత ప్రభుత్వం సమకూర్చింది. ప్రతీరోజు ఇళ్లలో చెత్తతో పాటు వీధులను శుభ్రంగా ఉంచాలి. అయితే గ్రామాల్లో కార్యదర్శులు ఎప్పటికప్పుడు పనులు చేపట్టాల్సి ఉంది. కాని అనుకున్న స్థాయిలో పనులు జరగడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. పోలంపల్లిలోని ఎస్సీ కాలనీలో మురుగుకాలువ నిండింది. కాలువలను శుభ్రం చేయించాలని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ధర్మారంలో మురుగుకాలువల్లో చెత్తతోపాటు వ్యర్థాలను తీసి రోడ్డు పక్కన వేశారు. దీంతో దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



పోలంపల్లిలో పేరుకుపోయిన డ్రెయినేజీ

కన్నెత్తి చూడని ప్రత్యేక అధికారులు

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పర్యవేక్షించాల్సిన ప్రత్యేక అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్య పనులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.



భీమారంలో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పట్టించుకోలేదు



గ్రామంలో ఎస్సీకాలనీ లో మురుగుకాలవలో పూడిక తొలగించాలని కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇంటి పక్కనే మురుగు నీటికారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

- దర్శనాల మధుకర్, పోలంపల్లి

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీలను సందర్శిస్తాం. ఉన్న కార్మికులతో చెత్తని తొలగించేందుకు కృషి చేస్తాం.

- మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

'అంజనిపుత్ర'కు అవార్డు



అవార్డు అందుకుంటున్న గుర్రాల శ్రీధర్, పిల్లి రవి

మంచిర్యాలటౌన్: అంజనిపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా కో–ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ చేతుల మీదుగా అంజని పుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ ప్రపంచ రికార్డు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడిచిన ఏడు సంవత్సరాలుగా కాలుష్యాన్ని నిర్మూలించాలన్న సంకల్పంతో అంజనిపుత్ర ఎస్టేట్స్‌లో శ్రీగంధం చెట్ల పెంపకంతో ఎప్పటికప్పుడు ఒక ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. శ్రీధర్ ఆధ్వర్యంలో 350ఎకరాల్లో 4లక్షల శ్రీగంధం చెట్లను నాటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలంగాణ ప్రతినిధులు అరుణ్‌కుమార్, తగరపు శంకర్, అంజనిపుత్ర మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి, కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యేలా బోధించాలి



పాఠం బోధిస్తున్న ప్రసాదరావు

దండేపల్లి: విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తేనే గుర్తుంచుకుంటారని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు అన్నారు. దండేపల్లి మండలం జైతుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. చదువు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తాను ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు పాఠాలను పాటలరూపంలో, నృత్యరూపంలో బోధించడంతో విద్యార్థులు ఎంతో సులభంగా అర్థం చేసుకునేదని గుర్తు చేశారు. ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు అలా బోధించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రూప్లా నాయక్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



రాజన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరిన జన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్నను సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పరామర్శించారు. నిమ్స్ ఆసుపత్రికి చేరుకొని ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎమ్మెల్యేను చూసిన డైరెక్టర్ కన్నీరు పెట్టుకోవడంతో ఎమ్మెల్యే ఆయన్ను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

గుండెపోటుతో ఒకరు మృతి

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన ఫిట్‌నెస్ సెంటర్ గురువు, ఆర్‌ఎంపీ కటుకూరి శ్రీనివాస్(55) సోమవారం మృతి చెందాడు. బాలుర పాఠశాల మైదానంలో ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులతో వ్యాయామం చేపిస్తున్న సమయంలో గుండెపోటు వచ్చింది. వెంటనే తోటి మిత్రులు స్పందించి సీపీఆర్ చేశారు. అయినా ఫలితం దక్కలేదు. ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



దండేపల్లిలో మాట్లాడుతున్న సదానందం

జన్నారం/దండేపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 9న నిర్వహించే 17వ అఖిలభారత పద్మశాలీ మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలీ 8వ మహాసభలను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలువేరు సదానందం పిలుపునిచ్చారు. పద్మశాలీ కులస్తులను మహాసభలకు తరలించేందుకు దండేపల్లి, జన్నారం మండలాల్లో సోమవారం సంఘనాయకులతో సమావేశమయ్యారు. పద్మశాలీల ఐక్యత కోసం నిర్వహించే మహాసభలకు సంఘ నాయకులు, కులస్తులు అధి క సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దండేపల్లి మండల పద్మశాలీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వడ్డేపల్లి దేవయ్య, అలిశెట్టి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శంకర్, నాయకులు సత్యం, జ్ఞానయ్య, చింటూ, పెద్ద బుచ్చన్న, శంకర్, రవీందర్, సంఘం జన్నారం మండల అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య, పట్టణ అధ్యక్షుడు చెటుపల్లి క్రిష్ణ, పద్మశాలీ సంఘ నాయకులు ఆడెపు లక్ష్మీనారాయణ, దోమల భాస్కర్, మధు, చెటుపల్లి రాజమౌళి, కందుల రమేష్, గోనె సత్యం, కొప్పుల రమేష్, రాము, వేణు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు

9న అఖిల భారత పద్మశాలీ మహాసభ

బెల్లంపల్లి: అఖిల భారత పద్మశాలీ 17వ మహాసభ, 8వ తెలంగాణ ప్రాంతీయ మహాసభలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పద్మశాలీ సంఘం సంయుక్త కార్యదర్శి డికొండ రాజలింగు తెలిపారు. పద్మశాలీ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మహాసభల పోస్టర్ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పద్మశాలీల సమస్యలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. పద్మశాలీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘ నాయకులు ట్రస్ట్ నాయకుడు ఈగ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, సతీష్, లక్ష్మీనారాయణ, ఉమా ప్రసాద్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయుడు, సిబ్బంది

కోటపల్లి: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న అసంపల్లి తిరుపతిని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు శాలువాతో ఘనంగా సన్మానించారు. తిరుపతి నిరుపేద కుటుంబంలో జన్మించి అంగవైకల్యాన్ని అధిగమించి ఉద్యోగం సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



నస్పూర్: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని విద్యుత్‌శాఖ నస్పూర్ ఏఈ మల్లేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఈ అంతరాయం ఏర్పడునని, వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

విద్యార్థుల 'పొలంబాట'



మందమర్రిరూరల్: మందమర్రి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా భువనగిరి జిల్లాలోని వన్ డే కిసాన్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. నీటిని నిలువ చేసే విధానం, పొలాల్లో నాటు వేయడం, దున్నడం, పండిన పంట కోయడం, ధాన్యం దంచే పరికరాల పనివిధానాన్ని పరిశీలించారు.


రాజుగూడలో పోలీసుల 'పల్లెనిద్ర'

దండేపల్లి: మండలంలోని రాజుగూడ గిరిజన గ్రామంలో దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 'పల్లెనిద్ర' చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్ మోసాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే మంచిదని తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'అవమానించడంతోనే ఆత్మహత్య'

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని రామన్‌కాలనీకి చెందిన వినయ్‌ని కొందరు అవమానపర్చడం వల్లనే, ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతికి కారకులైన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్.. అల్లుకున్న ప్రమాదం



బెల్లంపల్లి: భీమిని మండలం వెంకటాపూర్‌లోని ఓ వీధిలో విద్యుత్ తీగలపై చిక్కుడు తీగలు ఎగబాకి అల్లుకుంది. వేర్వేరుగా ఉండాల్సిన కరెంట్ తీగలు దగ్గరయ్యాయి. కొద్దిపాటిగా గాలి వీచినా కరెంట్ తీగలు ఒకదానికొకటి అంటుకొని విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. చిక్కుడు తీగను తొలగించి, కరెంట్ వైర్లను వేరు చేయాలని గ్రామస్తులు కరెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి: రాజనర్సు, ట్రాన్స్‌కో ఏఈఈ, భీమిని

ఫోన్ నంబర్ : 83339 23865

క్లుప్తంగా

పంటల క్షేత్ర సందర్శన



ఒత్కులపల్లిలో కర్బూజ పంట సాగులో సూచనలు అందిస్తున్న ఏడీఏ

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఒత్కులపల్లిలో వరి, కర్బూజ పంటల సాగును సోమవారం ఏడీఏ బానోతు ప్రసాద్ క్షేత్ర సందర్శన చేపట్టారు. వరిలో జింక్‌లోపం ఉందని, దీని నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలన్నారు. తెగుళ్ల నివారణకు కార్బండిజమ్, మాంకోజెబ్ మందును రెండు గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే కర్బూజలో బోరాన్ లోపం ఉన్నట్లు గుర్తించి బోరాన్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఏఈవో సాగర్, రైతులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురదగూడెం సమీపంలో (పాత మామిడి తోట వద్ద) అమ్మగుడి కమిటీ ఆధ్వర్యంలో అష్టలక్ష్మి కామాక్య దేవాలయంలో 4, 5, 6 తేదీల్లో విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు ఆల య అర్చకులు మంతెన సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎస్‌వో హరిత

కోటపల్లి: మండలకేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నృత్యం, ఆటపాటలతో అలరించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడం, పరీక్ష విధా నం, మెళుకువలపై ఎస్‌వో హరిత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాల్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



నాప్కిన్స్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

నస్పూర్: విద్యార్థినులు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త సౌజన్య పాల్గొని రుతుక్రమం సమయంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆహారపదార్థాల గురించి వివరించారు. వి ద్యార్థులకు ఉన్న అపోహలను తొలగించారు. అనంతరం విదార్థినులకు శానిటరీ క్లాత్ నాప్కిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన, జెండర్ స్పెషలిస్టు విజయ, అకౌంటెంట్ వసంతలక్ష్మి, విదార్థులు పాల్గొన్నారు.